

'ఏలేరు'లో పెరిగిన నీటి నిల్వలు 7

ఉప్పుటేరు కాలువలో తేలిన బాలుడి మృతదేహం 7

అవయవదానంతో నలుగురికి జీవదాత 6

నేటినుంచి యథావిధిగా పాఠశాలలు, కళాశాలలు

కాకినాడరూరల్,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం తగ్గిపోవడంతో కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో పాఠశాలలు గురువారం నుంచి యథావిధిగా పనిచేయాలని డీఈవో పిల్లిరమేష్ తెలిపారు. తుఫాన్‌నేపథ్యంలో తొలుత ఈనెల 31వరకూ జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంటర్‌విద్యకు సంబంధించి జిల్లాలోని జూనియర్ కళాశాలలు యథావిధిగా పనిచేస్తాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిణి ఐ.శారద తెలిపారు. ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు కూడా పనిచేయనున్నాయి.

- జేఎన్టీయూకే పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలకు వర్తింపు

జేఎన్టీయూకే పరిధిలోని ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు యథావిధిగా గురువారం నుంచి పనిచేయనున్నాయని, ఈ సమాచారాన్ని సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు తెలియచేయాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో నాయక్

జీజీహెచ్(కాకినాడ),అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తుఫాను బీభత్సం తర్వాత ఏ అంటురోగాలు, వ్యాధులు సోకకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలి. వ్యక్తిగత అవసరాలకు లేదా వంటలకు పరిశుభ్రమైన నీటిని మాత్రమే వినియోగించాలి. అన్ని నీటివనరులను క్లోరిన్ మాత్రలు లేదా బ్లీచింగ్ పౌడర్ ఉపయోగించి శుద్ధి చేసుకోవాలి. జ్వరం లేదా సీజనల్ వ్యాధుల లక్షణాలు కనబడితే దగ్గరలో ఉన్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యసిబ్బందిని సంప్రదించాలి. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకుని క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బందికి తెలియజేయాలి. తద్వారా సంబంధిత వైద్యనిపుణులు చికిత్సను అందజేస్తారు. అంటువ్యాధులు ప్రబలకుండా సచివాలయ సిబ్బందికి సహకరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ సూచించారు.


పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో జాగ్రత్త

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుఫాన్ ప్రభావం తగ్గడం వల్ల గురువారంనుంచి అన్ని పాఠశాలలు తెరవాలని ఆదేశించామని, తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. పాఠశాలలో శిథిలస్థితిలోఉన్న భవనాలు ఉంటే వాటిలో తరగతులు నిర్వహించవద్దన్నారు. పాఠశాల ప్రాంగణంలో నిర్మాణాలనిమిత్తం ఏమైనా గోతులు తవ్వి ఉంటే వర్షపు నీటితో అవి నిండిఉంటే విద్యార్థులు అక్కడకు వెళ్లకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

- కలెక్టర్ షాన్‌మోహన్ సూచనలు

విద్యార్థులు పాఠశాలలకు వచ్చే సమయంలో తిరిగి ఇంటికి వెళ్లే తరుణంలో కాలువలు, నదులు దాటాల్సి ఉంటే అధికారులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, హైవోల్టేజి లైన్లు ఉంటే వాటి పరిసరాలకు వెళ్లనీయొద్దన్నారు. పాఠశాలలో తడిచిన విద్యుత్ స్విచ్‌బోర్డులు, వైరింగ్ వంటివి ఉంటే విద్యార్థులను వాటివద్దకు పంపవద్దన్నారు. తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున వేడినీరును అందించాలన్నారు.

మిమ్మల్ని ఆదుకునేందుకే నేనున్నా



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తుఫాన్ ప్రభావానికి గురైన ప్రాంతాన్ని హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పొలాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

- ఓడలరేవు పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు సీఎం భరోసా
- రైతులను ఆదుకుంటానని బెండమూర్లంకలో హామీ
- ఓడలరేవులో పర్యటించిన చంద్రబాబు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

తుఫాన్ కష్టాల్లో ఉన్న మిమ్మల్ని ఆదుకోవడానికే నేను ఉన్నా.. అందుకే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా మిమ్మల్ని పలుకరించి ధైర్యం చెప్పాలని వచ్చానమ్మా.. మీరెవ్వరూ భయపడొద్దంటూ తుఫాన్ బారినపడిన బాధితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. మొంథా తుఫాన్ నష్టాలను హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌లో బుధవారం మధ్యాహ్నం దిగిన చంద్రబాబుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీ హరీష్‌బాలయోగితోపాటు కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబునాయుడు నేరుగా ఓడలరేవులోని తుఫాన్ షెల్టర్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ షెల్టర్‌లో ఉన్న బాధితులను చంద్రబాబు అందరినీ పలుకరిస్తూ నమస్కరిస్తూ ముందుకు సాగారు. తర్వాత బాధితుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ హెచ్చరికలు తమను ఎంతో భయాందోళనకు గురిచేశాయని, మంగళవారం రాత్రి బతుకు జీవుడా అంటూ భయం గుప్పిట్లో జీవించామని మహిళలు చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వారి కష్ట సుఖాలను చంద్రబాబు అడిగి తెలుసుకుని మీరెవ్వరూ అధైర్య పడొద్దు నేనున్నానంటూ వారందరికీ భరోసా ఇచ్చారు. ఆ ప్రాంతంలో తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాలను అడిగి తెలుసుకున్నారు.



అల్లవరం మండలం ఓడలరేవులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



అల్లవరం మండలం బెండమూర్లంకలో పడిపోయిన వరిచేలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

అనంతరం బాధితులకు 25 కిలోల బియ్యం ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు వంతున ఆర్థికసాయాన్ని చంద్రబాబు అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు పడే ఇబ్బందులు నాకు తెలుసు. అందుకే వారికి ఏ కష్టం కలగకుండా అన్నివిధాలా చర్యలు తీసుకుంటూ వారిని మనస్ఫూర్తిగా ఆదుకుంటాను. అది నా నైజం. దీంట్లో ఎటువంటి రాజకీయాలు ఉండవు. మీకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అనే భరోసా ఇచ్చేందుకు ఇంతదూరం వచ్చి మీతో మాట్లాడితే మీ కష్టం తీరడంతోపాటు నాలో కూడా బాధ తగ్గుతుంది.. మీరు అధైర్య పడొద్దు. మీకు నేనున్నానంటూ పదేపదే భరోసా ఇచ్చారు. అదే రీతిన బెండమూర్లంకలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట నష్టాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు రైతు నాయకులు యాళ్ల బ్రహ్మానందం, యాళ్ల దొరబాబులతోపాటు పలువురు రైతుల నుంచి నష్టాలను అడిగితెలుసుకున్నారు. పంట నష్టాలను అధికారులు నివేదించిన తర్వాత రైతులకు సహాయం ప్రకటిస్తానని రైతుల సమక్షంలో హర్షధ్వానాల మధ్య ప్రకటించి వారికి భరోసా ఇచ్చారు.

మొంథా తుఫాన్ నష్టాల గణన చేపట్టాలి

- తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల సంభవించిన నష్టాన్ని గణన చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం తుఫాన్ సహాయక చర్యలు, తుఫాన్‌వల్ల సంభవించిన నష్టం గణనపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార యంత్రాంగం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలతో తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. జిల్లా అధికార యంత్రాంగం మనస్సు పెట్టి మంచి సమయస్ఫూర్తితో పనిచేశారన్నారు. అదే స్ఫూర్తితో తుఫాన్ తర్వాత జరిగే సహాయక కార్యక్రమాల్లోను ప్రజలకు ఇబ్బందులు లేకుండా పని చేయాలన్నారు. ఆస్తి, పంట, పశువుల, రోడ్ల నష్టం అంచనాలను గడువులోగా నమోదు చేయాలన్నారు. భారీవర్షాలవల్ల జిల్లాలో ఎక్కడా ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం పనులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. నదులు, చెరువులు, వాగులు, కాలువలు గట్ల పటిష్టతను పరిశీలించి బలహీనంగా ఉన్న గట్టును పటిష్టవంతంగా చేయాలన్నారు. జిల్లాలో 401 తుఫాన్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి 35,114మందికి భోజన వసతి సదుపాయాలు కల్పించామన్నారు. బాధితులు ఒక్కరికి రూ.వెయ్యి చొప్పున కుటుంబానికి గరిష్ఠంగా రూ.3వేలు పంపిణీ చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి కుటుంబానికి 25కిలోల బియ్యం, కిలో కందిపప్పు, ఒక లీటరు వంటనూనె, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు, కిలో పంచదార అందజేయాలన్నారు. మత్స్యకార కుటుంబాలకైతే 50కిలోల బియ్యం ఇవ్వాలన్నారు. జిల్లాలో పంటనష్టాల అంచనాను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను నమోదు చేసి సమర్పించాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనీషా, డీఆర్వో వెంకట్రావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, పాడా పీడీ చైత్రవర్షిణి, సీపీవో త్రినాథ్, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, మత్స్యశాఖ జేడీ కృష్ణారావు, పౌరసరఫరాల సంస్థ డీఎం దేవులనాయక్, డీఎస్‌వో సత్యనారాయణరాజు, కాకినాడ కమిషనర్ సుధాకర్, జిల్లా ఉద్యానశాఖాధికారి సిరిల్, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకులు

- 41,932మందికి పంపిణీకి అధికారులు సన్నద్ధం
- 27,624మంది మత్స్యకారులు, 313మంది చేనేత కార్మికులు, 13,995 మంది ఇతరులు అర్హులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌వల్ల పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న 41,932మంది బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. దీనిలో 27,624మంది మత్స్యకారులకు, 313మంది చేనేతకార్మికులు,13,995 మంది ఇతరులు ఉన్నారు. మత్స్యకార, చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తారు. మిగిలినవారికి 25 కిలోల చొప్పున కుటుంబానికి పంపిణీ చేస్తారు.వీటితోపాటు కిలో చొప్పున కందిపప్పు, వంటనూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార పంపిణీ చేస్తారు. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లోని బాధితకుటుంబాలకు రూ.3వేల చొప్పున ప్రభుత్వం పరిహారం ఇస్తోంది. ప్రభుత్వ ప్రమాణాలను అనుసరించి ఈ పంపిణీ చేపడతారు.

జిల్లాలో 17,172 హెక్టార్లలో పంటలకు నష్టం

- నేటినుంచి నష్టాల గణనకు సిద్ధమవుతున్న అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌వల్ల మూడురోజులుగా కురిసిన వర్షాలకు జిల్లాలో 17,172 హెక్టార్లలో పంటలకు నష్టం జరిగింది. మొంథాపై విస్తృతంగా ప్రచారం జరిగింది, వర్షపాతం అంతంతమాత్రంగానే నమోదైంది. భారీ ఈదురుగాలలవల్ల పంటలకు నష్టం కలిగింది. జిల్లాలో 17,172 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లగా దీనిలో వరిపంట 16,262హెక్టార్లు, మొక్కజొన్న 29హెక్టార్లు, రాగి12హెక్టార్లు, మినుము 192హెక్టార్లు, పత్తి 677 హెక్టార్లు ప్రభావితం అయ్యాయి. జిల్లాలో 21 మండలాల పరిధిలో 222 గ్రామాల్లో పంటలు ప్రభావితమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 10,374మంది రైతులకు నష్టం జరిగింది. జిల్లాలో అత్యధికంగా కాజులూరు మండలంలో 3812 హెక్టార్లలో వరిపంట ముంపులో ఉంది. పెదపూడి మండలంలో 3680 హెక్టార్లు, సామర్లకోటలో 2481, కిర్లంపూడిలో 1317 హెక్టార్లలో పంటలు ముంపులో ఉన్నాయి. తాళ్లరేవులో 550హెక్టార్లు, గొల్లప్రోలులో 312, గండేపల్లి 352, జగ్గంపేట 137, కరప 1136, కాకినాడ రూరల్ 265, తొండంగి 265, పిఠాపురం 390, పెద్దాపురం 138, ఏలేశ్వరం 841, తుని 339, యు.కొత్తపల్లి 655, కాకినాడ అర్బన్ 55, శంఖవరంలో 53, రౌతులపూడి 168, ప్రత్తిపాడు 380 హెక్టార్లలో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. గురువారం నుంచి జిల్లాలో 21 మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాల గణనకు అధికారులు సిద్ధమవుతున్నారు.

గాలితోనే.. నష్ట'మొంథా'..

- తెరిపిచ్చిన తుఫాన్
- దారిమళ్లిన మొంథా
- ఊపిరిపీల్చుకున్న కాకినాడ జిల్లా వాసులు
- కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు
- నేటి నుంచి బాధితులకు ఆర్థికసాయం అందజేత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

తుఫాన్ తెరిపిచ్చింది. కానీ, వ్యవసాయ, విద్యుత్ రంగాలకు నష్టంచేకూర్చింది. విపరీతమైన వేగంతో ఈదరుగాలులు.. ఏకధాటిగా వానతో మంగళవారం కనిపించిన భయానక వాతావరణం.. బుధవారం ఉదయానికి మారిపోయింది. తుఫాన్ ప్రభావం భారీగా ఉంటుందన్న అంచనాతో జిల్లా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. ఆస్తి,ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రాలతోపాటు పలుచోట్ల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని అధికారులు సమీక్షించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాలకు ప్రజలను తరలించారు. కోనసీమ జిల్లాలోని అంతర్వేదిపాలెంలో తుఫాన్ తీరాన్ని తాకడంతో కాకినాడకు పెను ప్రమాదం తప్పింది. బుధవారం వాతావరణం పూర్తిగా మేఘావృతమై వర్షం కురిసింది. తుఫాన్ తీరం దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచనతో చాలామంది ఇళ్లకే పరిమితమయ్యారు.

ఈదురుగాలులకు అక్కడక్కడా చెట్లు నేలకొరిగాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కాకినాడలో విరిగిపడిన చెట్లను మున్సిపల్, ఫైర్ సిబ్బంది తొలగింపజేశారు. విద్యుత్‌శాఖకు రూ.35లక్షలకు పైగా నష్టం జరిగినట్టుగా అంచనా వేస్తున్నారు. తుఫాన్ తీవ్రత తగ్గినా జిల్లాలో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో రెండురోజులుగా 401 తుఫాన్ సహాయక కేంద్రాల ద్వారా 35,114మందికి భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. వాతావరణం తెరిపివ్వడంతో చాలామంది ఇళ్లకు బయల్దేరి వెళ్లారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో భారీ ఈదురుగాలులకు 17,172హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. పిఠాపురంలో 400ఎకరాల్లో అరటి, 190ఎకరాల్లో మొక్కజొన్న, 1500 ఎకరాల్లో పత్తి, 5వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. జగ్గంపేటలో స్వీట్‌కార్న్, కూరగాయలు, మినుము పంటలు దెబ్బతిన్నాయి.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో నేలనంటిన అరటి పంట



అంతర్వేది తుఫాన్ షెల్టర్‌లో భోజన ఏర్పాట్లు



కరప మండలంలో నీట మునిగిన వరిపొలం



అంతర్వేది వెళ్లే ప్రధాన రహదారి వద్ద నీటమునిగిన దృశ్యం

ఉప్పాడ శివారు సూరాడపేటలో అలల ఉధృతికి కూలిన మత్స్యకారుల ఇళ్లు

అనధికార నిర్మాణాలపై ప్రభుత్వం సీరియస్

- కఠిన చర్యలకు ఆదేశాలు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికార నిర్మాణాలపై కఠిన వైఖరిని అవలంభించనుంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ విడుదల చేసిన మెమో నం.3014209/ఎం2/2025 ప్రకారం, 2025 ఆగస్టు 31 తర్వాత నిర్మించిన అక్రమ భవనాలు కూల్చివేతకు గురవుతాయని స్పష్టం చేసింది. తాజాగా ప్రవేశపెట్టిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్)లో 1985 జనవరి 1నుంచి 2025, ఆగస్టు 31 మధ్య నిర్మించిన భవనాలకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది. ఈ గడువు తర్వాత నిర్మించిన అక్రమ నిర్మాణాలు ఏ విధంగాను క్రమబద్ధీకరణకు అర్హం కావని తెలిపింది. అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలు, అదనపు అంతస్తుల క్రమబద్ధీకరణకు ఉద్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్) అమలుకు ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించడంతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ జారీ చేసిన ఈ ఆదేశాల ప్రకారం మంజూరైన ప్రణాళికలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగిస్తే తక్షణమే కూల్చివేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. బీపీఎస్ అమలుకు సమగ్ర మార్గదర్శకాలను పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ త్వరలోనే విడుదల చేసే అవకాశముంది.

వెన్ను విరిచింది!

- తుఫాన్‌తో వరి, పత్తి, మొక్కజొన్న, బొప్పాయి పంటలకు భారీ నష్టం

పిఠాపురం/గొల్లప్రోలు/గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వెన్ను విరిచింది. అన్ని రకాల పంటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులు, వర్ష ప్రభావంతో పంటలు నేలనంటాయి.

తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధవారాల్లో వీచిన భారీ ఈదురుగాలులు, ఆపై వర్షంతో వరి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు చేబ్రోలు, లక్ష్మీపురం, సీతానగరం, ఏకే, ఏపీ మల్లవరం, చెందుర్తి, తాటిపర్తి, మాధవపురం, విరవ, విరవాడ, బి.ప్రత్తిపాడు, బోగాపురం, రాపర్తి, పి.రాయవరం, పి.తిమ్మాపురం, నరసింగపురం, జములపల్లి తదితర గ్రామాల్లో వరి పంట నేలనంటింది. పి.రాయవరం, గొల్లప్రోలు, గోకివాడ, జములపల్లి తదితర ప్రాంతాల్లో నేలకొరిగిన వరి పంటపై వర్షపు నీరు చేరింది. బుధవారం రాత్రి వరకూ వర్షపు జల్లులు పడుతుండటంతో కంకులు నాని మొలకెత్తే ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 1500 ఎకరాల్లో పంట నేలకొరిగింది. మరో 5వేల ఎకరాల్లో దిగుబడి తగ్గుతుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం వరి పంట పాలు పోసుకునే దశ నుంచి గింజ గట్టి పడే దశలో ఉంది. ఈ దశలో గాలులు, వర్షం పంటకు నష్టం చేకూరుస్తాయని చెబుతున్నారు. 20 నుంచి 50శాతం వరకూ దిగుబడులు తగ్గే అవకాశం ఉండటంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిఠాపురం మండలం పి.రాయవరంలో నేలకొరిగి నీటిలో నానుతున్న వరి పంట

నేలనంటిన అరటి

తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులు అరటి పంటకు తీవ్ర నష్టం కలుగజేశాయి. గొల్లప్రోలు మండలం దుర్గాడ, ఏ.విజయనగరం, చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి, చినజగ్గంపేట గ్రామాలు, పిఠాపురం మండలం పి.దొంతమూరు, వెల్దుర్తి, కందరాడ, కోలంక, విరవ, విరవాడ తదితర గ్రామాల్లో అరటి తోటలు నేలకూలాయి. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వచ్చే దశలో చెట్లు విరిగిపోవడంతో రైతులకు అపారనష్టం వాటిల్లింది. ఎకరానికి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకూ నష్టం జరిగిందని రైతులు తెలిపారు. సుమారు 425 ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగినట్లు అంచనా. సుమారు 275 ఎకరాల్లో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతిన్నది. గాలుల తాకిడికి మొక్కజొన్న మొక్కలు విరిగిపోయాయి. దీంతో పంటపై పెట్టిన పెట్టుబడి పూర్తిగా నష్టపోయామని రైతులు తెలిపారు. బొప్పాయి, మునగతోటలు నేలనంటాయి. కాయగూర పంటలు దెబ్బతిన్నాయి. మొదటి వి డత దిగుబడి వచ్చే సమయంలో కురిసిన వర్షంతో పత్తి పంట తడిచిపోయింది. దీనితో పత్తినాణ్యత దెబ్బతిని ధర రాదని రైతులు చెప్పారు. అపరాల పంటలకు నష్టం జరిగింది.

ఆలయాలు, సత్రాలకు వాటిల్లిన నష్టాలపై నివేదిక

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తుఫానుప్రభావంతో జిల్లావ్యాప్తంగా దేవదాయ, ధర్మదాయశాఖకు చెందిన ఆలయాలు, సత్రాలకు వాటిల్లిన నష్టాలపై జిల్లాఅధికారులు అంచనాలు తయారుచేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలు, సత్రాల ఈవోలతో జిల్లా దేవదాయశాఖఅధికారి కనపర్తి నాగేశ్వరరావు బుధవారం మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాకినాడ డివిజన్ తనిఖీదారు వడ్డి ఫణికుమార్ ఈవోలతో నష్టాల వివరాలు, ఫొటోలను తీసుకుని అంచనాల నివేదిక తయారుచేశారు.దేవాలయాలు,సత్రాలు,మఠాలకు నష్టం ఏర్పడితే వాటి వివరాలను తయారుచేసి తనకు, కలెక్టర్‌కు నివేదికను పంపించాలని ఆశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నాగేశ్వరరావును ఆదేశించడంతో అధికారులు నివేదిక సమర్పించారు.



అమలాపురం కలెక్టరేట్‌లో తుఫాన్ అనంతర పరిస్థితులపై సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ మహేష్‌కుమార్, ప్రత్యేకాధికారి విజయరామరాజు, ఎంపీ హరీష్, ఎమ్మెల్యేలు

మొంథా తుఫాన్

తీవ్రత స్వల్పమే

- జిల్లాలో 54 విద్యుత్ సబ్ స్టేషన్‌లపై ప్రభావం
- పడిపోయిన 300 విద్యుత్ స్తంభాలు
- 134 కిలోమీటర్ల మేర కుప్పకూలిన వృక్షాలు
- 41 కేంద్రాల్లో 10వేల మందికి పైగా ఆశ్రయం
- బాధిత కుటుంబాలకు రూ.3వేలు ఆర్థిక సాయం
- సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



అమలాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం ముందుగా ఊహించినంత తీవ్రత లేకపోయింది.. అయినప్పటికీ విద్యుత్ సరఫరా, రోడ్డు, రవాణా, రాకపోలకు ఇబ్బంది కలిగించింది అని రాష్ట్ర వ్యవసాయ సహకార, ఉద్యాన, మార్కెటింగ్, డెయిరీ డెవలెప్మెంట్, మత్స్య శాఖల మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో మొంథా తుఫాన్ సహాయక చర్యలపై సమీక్షించారు. ఈదురుగాలులకు జిల్లావ్యాప్తంగా సుమారు 300 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. 80 శాతం పునరుద్ధరించామని, మిగిలిన 20 శాతం పూర్తి చేసి ఇళ్లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు రేయింబవళ్లు జరుగుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 54 సబ్ స్టేషన్‌లపై మొంథా తుఫాన్ ప్రభావం పడిందన్నారు. రామచంద్రపురం, రాజమహేంద్రవరం, ముమ్మిడివరం తదితర ప్రాంతాల నుంచి మానవవనరులను తరలించి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

రహదారులపై 134 కిలోమీటర్ల మేర రాకపోకల పునరుద్ధరణ పూర్తయిందన్నారు. బుధవారం నుంచి ఆర్టీసీ బస్సులు నూటికి నూరుశాతం రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. మంగళవారం పునరావాస కేంద్రాల్లో భోజన వసతి పొందిన వారికి బుధవారం సాయంత్రం వరకు ఆశ్రయం కల్పిస్తూ రాత్రి భోజనం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేల ఆర్థిక సాయం అందించి స్వగృహాలకు పంపించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో 400 పునరావాస కేంద్రాలు నిర్వహించి 10,150 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. వీరిలో కుటుంబాలకు రూ.3వేలు చొప్పున, ఒంటరి సభ్యులకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం పంపిణీ చేయాలన్నారు.

ఐదు రోజులుగా సముద్రంపై వేటకు వెళ్లకుండా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు, చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు.

గురువారం నుంచి రేషన్ డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిని ఆదేశించారు.

జిల్లావ్యాప్తంగా సుమారు 20వేల ఎకరాల్లో వరి పంట నష్టానికి గురైందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు.

వరితో పాటు అరటి తదితర ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని గణించడానికి వేయడానికి బృందాలను నియమించామని, పూర్తిస్థాయి నివేదిక రూపొందిస్తామన్నారు. విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా పంటల నష్టాలను తగ్గించడానికి కృషి చేస్తామన్నారు.

బియ్యం, ఆర్థిక సహాయం పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేసి పారదర్శకంగా అందించాలనిసూచించారు.

మామిడికుదురు మండలంలో చనిపోయిన మహిళ కుటుంబానికి పోస్టుమార్టం అనంతరం టీఆర్ 27 నష్టపరిహారం రూ.5 లక్షలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ద్వారా పంపిణీ చేయాలన్నారు.

సమావేశంలో మొంథా తుఫాన్ సహాయ చర్యల ప్రత్యేకాధికారి వి.విజయరామరాజు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎస్పీ రాహుల్‌మీనా, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, నిమ్మకాయల చినరాజప్ప, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, డీఆర్వో కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపుతో సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో మొంథా తుఫాన్‌ను అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నా మని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వాతావరణ శాఖ సూచనలతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణనష్టం లేకుండా కాపాడామన్నారు. వేలాది మందిని పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు గర్భిణులు, పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం సూచనలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ చర్యలు చేపట్టి నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. సమర్థత కలిగిన సీఎం సూక్ష్మస్థాయిలో మేనేజ్‌మెంటు చేయగలడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి రూ.3 వేలు నగదు, 25 కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు, కిలో కందిపప్పు, కిలో పంచదార, కిలో ఆయిల్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమావేశంలో వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో బాధితులకు నగదు, నిత్యావసరాలు

కోస్తా జిల్లాల ప్రత్యేకాధికారి అజయ్‌జైన్



కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో ప్రత్యేకాధికారి అజయ్‌జైన్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని కోస్తా జిల్లాల ప్రత్యేక అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట, నేమాం, ఉప్పాడ సముద్ర తీరాన్ని కలెక్టర్ షాన్‌మోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ ముప్పు తప్పిందన్నారు. గురువారం నుంచి ప్రజలకు నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి రూ.3వేలు నగదు, 25 కిలోల బియ్యం (మత్స్యకారులకు 50 కిలోలు) తో పాటు కిలో కందిపప్పు, లీటరు వంటనూనె, కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార అందజేస్తామన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన వాటి గణన ప్రక్రియ చేపట్టాలన్నారు. తుఫాన్ అనంతరం సహాయక చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తుఫాన్ తీరం దాటినప్పటికీ రెండు రోజుల పాటు దాని ప్రభావం ఉంటుందని, ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. పర్యటనలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పాల్గొన్నారు.



కొత్తపట్నం వద్ద పైకి వచ్చిన జియోట్యూబ్ గాబియాన్ సంచులు

అలల ఉధృతికి జియోట్యూబ్ ఛిద్రం

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బీభత్సానికి కాకినాడ జిల్లా ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం వద్ద జియోట్యూబ్ పూర్తిగా ఛిద్రమైంది. సముద్రం ఒడ్డున నాలుగైదు అడుగుల లోతులో ఇసుకతో డంప్ చేసిన గాబియాన్ సంచులు కెరటాల ఉధృతికి పైకి లేచాయి.

అధికారులు సమన్వయంతో సేవలందించారు

- అందుకే సమస్యలను అధిగమించాం
- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



కొత్తపట్నంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతంలో అధికారులు సమన్వయంతో సేవలందించడంతో సమస్యలను అధిగమించామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపట్నంలో కెరటాల ఉధృతికి గండిపడిన బీచ్ రోడ్డుకు బండ రాళ్లతో రక్షణ కల్పించడాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ స్థానిక మీడియాతో మాట్లాడారు. తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన వెంటనే కూటమి ప్రభుత్వం వేగంగా స్పందించడంతో ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారులు చేసిన కృషిని అభినందించారు. సీఎం, డిప్యూటీ సీఎం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి సంబంధిత అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చేవారన్నారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గాక ఎక్కెడక్కడ ఎంతమేర నష్టం జరిగిందో అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని ఎంపీ చెప్పారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), ఆ పార్టీ వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ వున్నారు.

మూడో రోజూ పలు రైళ్లు రద్దు

సామర్లకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మీదుగా విశాఖ, విజయవాడ వైపు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను మూడో రోజైన బుధవారం కూడా రద్దు చేశారు. సామర్లకోట రైల్వే స్టేషన్ హెల్ప్ డెస్క్ అధికారి అందించిన సమాచారం మేరకు రద్దయిన వాటిలో 17244 రాయగడ-గుంటూరు, 07166 భువనేశ్వర్-సికింద్రాబాద్, 12805 విశాఖ-లింగంపల్లి, 18521 విశాఖ-కడప- తిరుమల, 12776 లింగంపల్లి-కాకినాడ ఎక్స్‌ప్రెస్ వున్నాయి. డోర్నకల్ జంక్షన్ వద్ద రైల్వే ట్రాక్ పైకి నీరు చేరడంతో మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించారు. వీటిలో 20833 విశాఖ-సికింద్రాబాద్, 17205 షిర్డీసాయినగర్-కాకినాడ, 17206 కాకినాడ-షిర్డీసాయినగర్ వున్నాయి. 20834 సికింద్రాబాద్-విశాఖ బుధవారం సాయంత్రం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరాల్సి ఉండగా ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి ఎనిమిది గంటలకు బయల్దేరింది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం కూడా హెల్ప్ డెస్క్ ద్వారా సేవలందిస్తామని సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్ చెప్పారు.



రకరకాల పనిముట్లతో 'ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ వాహనం'

కదిలే విపత్తు నిర్వహణ

'ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ వాహనం'

- 20 రకాల వస్తువులు.. 10 టన్నుల బరువు
- బాధితుల ఆచూకీ కనుగొనే కెమెరా
- బోట్లు, లైఫ్ బాయ్స్, పవర్ సాలు.. ఇంకా ఎన్నో...

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వ స్థాయిలో జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) మాదిరిగా రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర విపత్తు స్పందన దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్) విపత్తుల సమయంలో సహాయక చర్యలకు రంగంలోకి దిగడానికి ప్రతి క్షణం సిద్ధంగా ఉంటుంది. రెస్క్యూ, వరద సహాయక చర్యలు, ప్రథమ చికిత్సవంటి వాటిలో సహాయపడుతుంది. బాధితులను రక్షించడంతోపాటు ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రులకు తరలిస్తోంది. బాధితులకు ఆహారం, తాగునీరు, నిత్యావసరాల వంటి వాటిని పంపిణీ చేయడంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తోంది. విపత్తు ప్రాంతాల్లో గందరగోళం ఏర్పడకుండా సహాయక చర్యలు సక్రమంగా జరిగే విధంగా చూస్తుంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి అధునాతన రక్షణ టెక్నిక్‌లు, పరికరాల వినియోగం, వివిధ రకాల విపత్తుల్లో స్పందించాల్సిన తీరుపై నిరంతరంగా శిక్షణ ఇస్తుంటారు. విపత్తుల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాగృతం చేయడం కూడా విధుల్లో భాగంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు దళాల నుంచి సామర్థ్యం ఆధారంగా ఎంపికచేసి ఎస్‌డీఆర్‌ఎఫ్‌కి సంబంధించి కఠినశిక్షణ ఇస్తారు. విపత్తుల సమయంలో ఆయా ప్రదేశాల్లో ముందస్తుగా ఈ బృందాలను మోహరిస్తారు. రెవెన్యూ శాఖ వీరి వసతి, సదుపాయాలను చూసుకుంటుంది. సహాయం గురించి ఫోన్‌కాల్ వచ్చిన 10 నిమిషాల్లో సిద్ధమై బయలుదేరుతారు. విపత్తు ప్రదేశాలకు వెళ్లిన తర్వాత ఎవరి ఏ పనిచేయాలనే అంశంపై స్పష్టమైన నిర్దేశం ఉండడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడకుండా సహాయక చర్యలు కొన సాగిస్తారు. వీరివద్ద విపత్తు నిర్వహణ సాధనా సంపత్తితో ఉండే వాహనం గురించి ప్రత్యేకమని చెప్పాలి. ఈ వాహనంలో విపత్తు నిర్వహణకు అవసరమైన అన్ని పరికరాలు/వస్తువులు ఉంటాయి. తిత్లీ తుఫాను సమయంలో వీటిలోని కొన్ని పరికరాల కొరత ఉంటే అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు వాటిని హెలీకాప్టర్లలో పంపించి వాహనాల్లో సమకూర్చారు. మొత్తం సరంజామాతో కలుపుకొని ఈ వాహనం 10టన్నుల బరువు ఉంటుంది.

మొంథా తుఫాన్‌కి ఉమ్మడి జిల్లాలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించిన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

వాహనంలో ఇవే..

- **ఇన్‌ఫ్లాటబుల్ రబ్బర్ బోట్లు:** వీటిని సులభంగా తరలించవచ్చు. యంత్రంతో గాలి నింపగానే బోటు సిద్ధం అవుతుంది. నీటిలో చిక్కుకున్న వాళ్లను రక్షించడంలో సహాయపడుతుంది. 8 నుంచి 12 వరకూ ప్రయాణించే వీలుంటుంది.
- **చైన్‌సాలు:** బలమైన గొలుసు(చైన్) మాదిరిగా అమర్చి ఉంటే పవర్ సాలు ఇవి. రోడ్లపై చెట్లు పడిన సందర్భంగా తక్కువ వ్యవధిలో వాటిని కట్ చేసి తొలగించడానికి ఉపయోగిస్తారు.
- **హెవీరోప్స్:** లోడు లారీలను సైతం లాగే మంద పాటి తాళ్లు. ఒక్కోటి సుమారు 30 మీటర్లు ఉంటుంది. ఇలాంటివి ఈవాహనంలో 5 నుంచి 10 వరకూ ఉంటాయి.



ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ వాహనంతో సిబ్బంది

- **లైఫ్ బాయ్స్:** గుండ్రని ద్విచక్ర వాహనం ట్యూబ్ మాదిరిగా ఉంటాయి. నీటిలోప్రమాదంలో ఉన్న వాళ్లకు వీటిని విసురుతారు. దానిని మెడద్వారా వేసుకుంటే నీటిపై తేలుతూ ఉండొచ్చు.
- **రెస్క్యూ ట్యూబ్స్:** పొడవాటి వెడల్పు ట్యూబులు ఉంటాయి. వీటిలో గాలిని నింపి నీటి లో నుంచి తీసుకురావాల్సిన బాధితుడికి క్లిప్పుల ఆధారంగా అమరుస్తారు. దీంతో అతడు నీటిపై తేలుతూ ఉండగా రెస్క్యూటీం ఒడ్డుకుచేరుస్తుంది. లైఫ్ జాకెట్స్‌ని కోటు మాదిరిగా వేసుకుంటే నీటిలో మునగడం ఉండదు. త్రోబ్యాగ్స్ ఇలాంటివే. ఆ బ్యాగు తాడు అమర్చి ఉంటుంది. బ్యాగ్‌ని బాధితుడు ఒకవైపు పట్టుకోవడం, నడుముకి కట్టుకోవడంచేస్తే తాడుతో ఒడ్డుకు చేరుస్తారు.
- **గొడళ్లు:** పదునైన పెద్ద పెద్ద గొడ్డళ్లు ఉంటాయి. ఒకవేళ పవర్ రంపాలను ఉపయోగించే పరిస్థితి లేకపోతే వీటితో కట్ చేస్తారు. విద్యుత్ వైర్లను విద్యుత్ ప్రవాహం ఉండగానే వీటిలో కట్ చేయవచ్చు. వీటికి ఉండే పిడి ఇన్సులేటర్(షాక్‌ప్రూఫ్) మాదిరిగా పనిచేస్తుంది. పెద్ద సుత్తులు కూడా ఉంటాయి.
- **స్పెడ్డర్ కట్టర్:** ఇనుప తలుపులు వంటి వాటికి పెద్దరంధ్రం పెట్టడానికి ఉపయోగిస్తారు. కారు ప్రమాదం జరిగి డోర్లు రాకపోతే డోరు బలవంతంగా ఊడతీయడానికి సమయం పడుతుంది. అలా కాకుండా డోరుకు పెద్ద రంధ్రం చేయడం ద్వారా బాధితులను తక్కువ సమయంలో బయటకు తీస్తారు. వాహనంలో ఉండే ఐరన్ కట్టర్లతో ఐరన్ ఊచలు, ప్లేట్లు వంటి వాటిని కట్ చేస్తారు.
- **స్పైన్‌బోర్డ్స్,స్ట్రెచర్స్:** బాధితులను అంబులెన్సులలోకి, మెడికల్ క్యాంపులకు తర లించడానికి, ప్రథమ చికిత్స అందించడానికి ఉపయోగిస్తారు.
- **స్కూబా, స్కూబా సూట్స్:** నీటిలో లోతుకు వెళ్లడానికి స్కూబా, రసాయన విపత్తులు జరిగిన సమయంలో, పొగ కమ్ముకొన్న ప్పుడు బాధితులను రక్షించడానికి స్కూబాసూట్లు ఉపయోగపడతాయి.
- **వీఎల్‌సీ:** విక్టిం లొకేటింగ్ కెమెరాను వీఎల్‌సీ అంటారు. భవనాలు కూలిన సమయంలో శిథిలాల కింద ఏమున్నాయో చూడడానికి ఇది ఉపకరిస్తుంది. ఒక గొట్టం ద్వారా దీనిని పంపించి శిథిలాల కింద పరిస్థితిని అంచనా వేస్తారు. అక్కడ చిక్కుకున్న బాధితులను రక్షించడంలో ఎక్కువగా ఉపయోగిస్తారు.

ప్రత్యేక ప్రోత్సాహం నిల్


విపత్తు వేళ బయట పడడానికి అందరూ పరుగులు పెడితే.. విపత్తుకు ఎదు రెళ్లి బాధితులను రక్షించే విధుల్లో ఎన్‌డీ ఆర్‌ఎఫ్ పని చేస్తుంది. ఈ క్రమంలో ఈ సిబ్బంది ప్రమాదాలే కాకుండా వ్యాధుల బారిన కూడా పడుతూ ఉంటారు. భోజనం చేసే సమయంలో ఫోన్ వస్తే తినడం ఆపేసి తక్షణమే బయలుదే రాల్సిన పరిస్థితులు ఉంటాయి. తిరిగి ఎప్పుడు ఇళ్లకు చేరకుంటారో కూడా తెలియదు. అలాంటి విధుల్లో ఎన్‌డీఆర్ ఎఫ్ సిబ్బందికి ప్రత్యేక ఎలవెన్సులు లేకపోవడం వారిని ఆవేదనకు గురి చేస్తోంది. పోలీస్ విభాగాల్లో కొన్నిటికి ఉదాహరణకు ఈగిల్‌కి 30%, మహిళా పోలీస్ స్టేషన్ 30% ప్రత్యేక ఎలవెన్సు కింది చెల్లిస్తారు. అలాగే ఎన్‌డీఆర్‌ఎఫ్‌కి కూడా ఇవాల్సిన అవసరం ఉంది.

ఎన్‌డీఆర్‌ఎఫ్

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీ ఆర్‌ఎఫ్)ను విపత్తు నిర్వహణ చట్టం-2005 ప్రకారం 2006లో ఏర్పాటు చేశారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పని చేస్తోంది. భూకంపాలు, వరదలు, తుఫాన్‌లు, భవనాలు కూలిపోవడం, కొండచరియలు విరిగిపడడం వంటి విపత్తు సమయంలో బాధితులను రక్షించడంలో సహాయం చేస్తుంది. న్యూకియర్ విపత్తుల సమయంలో కూడా ఈ ఫోర్స్ రంగంలోకి దిగుతుంది. ఈదళాల్లో సుశిక్షితులైన సీఆర్పీఎఫ్ తదితర పారా మిలిటరీ పోలీసులు ఉంటారు. వీరికి ప్రత్యేక ఎలవెన్సులు కూడా ఉంటాయి.

అవయవదానంతో నలుగురికి జీవదాత

- గ్రీన్‌ఛానెల్ ద్వారా వేర్వేరు ప్రాంతాలకు తరలింపు




గ్రీన్‌ఛానెల్ ద్వారా అవయవాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమైన దృశ్యం


సామర్లకోట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌తో ప్రాణాలు కోల్పోయిన ఒక యువకుడు తన అవయవాలను దానంచేసి మరో నలుగురికి ప్రాణదానంతో జీవదాతగా నిలిచాడని కాకినాడజిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులోని కొప్పవరంవద్ద గల మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ శుభాకరరావు వెల్లడించారు. బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఈమేరకు జీవదాత వివరాలను తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురానికి చెందిన జి.మహేష్ అనే యువకుడు ఈనెల 26న అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం సదరు యువకుడిని కొప్పవరం మెడికవర్ ఆసుపత్రికి తీసుకురాగా మెడికవర్ వైద్యులు ఎంతమేర వైద్యం అందించినా యువకుడి బ్రెయిన్ ఎంతమాత్రం స్పందించకపోవడంతో 27న వైద్యబృందం యువకుడిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో యువకుడి తల్లిదండ్రులు అవయవదానంపై అవగాహన ఉండడంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారన్నారు. జీవన్‌దాన్ అనుమతులతో మెడికవర్ హాస్పిటల్స్ వైద్యబృందం తమ హాస్పిటల్‌లోనే అవయవ సేకరణ కార్యక్రమం నిర్వహించారన్నారు. కాకినాడజిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ డాక్టర్ పి.ఫణికిరణ్ పర్యవేక్షణలో డాక్టర్ కళ్యాణ్‌బాబు, డాక్టర్ రాజా అమరేంద్ర, డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ అరవింద్‌లు క్రిటికల్ కేర్ హెచ్‌వోడీలు, మెడికవర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ టీమ్, సమన్వయంతో అవయవాలను సేకరించారన్నారు. సేకరించిన అవయవాలను గ్రీన్‌ఛానెల్ ద్వారా అవసరమైన ఆసుపత్రులకు యుద్ధప్రాతిపదికన తరలించి నలుగురికి కొత్తజీవితం అందించారన్నారు. జీవన్‌దాన్ ప్రతినిధి డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయవదానం అనేది జీవితానికి పరమార్థం. ఒకరి జీవిత ప్రయాణం ముగిసినా ఆయన అవయవాలు మరెందరికో కొత్త శ్వాసగా మారతాయన్నారు. ఇది కేవలం దాతృత్వం కాదు సమాజానికి మనం అందించే విలువైన బహుమతిగా అభివర్ణించారు. అంతేకాదు మరొకరికి కొత్తజీవితం అన్నారు. ఇలాంటి దాతృత్వ నిర్ణయాలు సమాజంలో జీవం నింపుతాయని పేర్కొంటూ అవయవదానం చేసేందుకు ముందుకువచ్చి నలుగురికి జీవదాతగా మారేందుకు ప్రోత్సహించిన యువకుడి తల్లిదండ్రులను సెంటర్ హెడ్ శుభాకరరావు అభినందించారు.

శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో

సప్త నదీ జలాభిషేక మహోత్సవాలు ప్రారంభం



శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి





పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పల్లకీ సేవ, సప్త నదీ జలాలకు పూజ చేస్తున్న ఈవో సౌజన్య

పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీపాదశ్రీవల్లభ స్వామికి మూడు రోజులు నిర్వహించే సప్త నదీ జలాభిషేక మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వరణ, శ్రీపాదులకు దత్తాత్రేయ మూలమంత్ర పాశుపతాభిషేకం జరిగాయి. మధ్యాహ్నం అగ్నిప్రతిష్ఠాపన, లక్ష్మీగణపతి సహిత రుద్రహోమం, దత్త మూలమంత్ర హోమం నిర్వహించారు. ఉదయం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయంలో సప్త నదీ జలాలకు ఈవో ఆర్.సౌజన్య పూజలు చేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతిలను పుష్పాలతో అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

'మొంథా' ముంచేసింది!

మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భారీ ఈదురుగాలులకు భారీ వృక్షాలు, కొబ్బరి చెట్లు పేకమేడల్లా కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆ చిత్రాలే ఇవి


బిక్కవోలు మండలం ఊలపల్లిలో నేలకొరిగిన వరి పంట


పెరవలి మండలం కాకరపర్రు వద్ద నేలవాలిన అరటి గెలలు


కోనసీమ జిల్లా అంతర్వేదిలో నీట మునిగిన గృహాలు


ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో దెబ్బతిన్న పత్తి పంట


అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో నేలకొరిగిన తాటి చెట్టు


ఉప్పాడలో రహదారిపై కూలిన వృక్షం


రాజవొమ్మంగి మండలం దూసరిపాము గ్రామ శివారులో రోడ్డుపై పడిన చెట్టు


మామిడికుదురు మండలం గెద్దాడలో నేలనంటిన వరిచేలు


మలికిపురం మండలం తూర్పుపాలెంలో నేలకొరిగిన చెట్లు


రాజమహేంద్రవరంలో చెట్ల కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా


గోకవరం మండలం గాదెలపాలెంలో నేలకొరిగిన వరి పంట


దేవరపల్లి మండలం పల్లంట్లలో పడిపోయిన బొప్పాయితోట


కె.గంగవరం మండలం పామర్రులో పడిపోయిన వరి పొలం


శంఖవరం మండలం కత్తిపూడిలో కూలిన ఇల్లు


ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పరిశీలిస్తున్న ఎంపీ సతీష్, ఎమ్మెల్యే సత్యప్రభ

'ఏలేరు'లో పెరిగిన నీటి నిల్వలు

దిగువకు 4900 క్యూసెక్కుల విడుదల

ప్రాజెక్టును పరిశీలించిన ఎంపీ సతీష్, ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో కాకినాడ జిల్లా ఏలేశ్వంలోని ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి దిగువకు 4900 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో మరో 2 టీఎంసీలు నీటిని నిల్వచేసే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్టులో బుధవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.35 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 21.66 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కుల నీటిని, దిగువ ప్రాంతాలకు 4900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఏలేరు జలాశయాన్ని రాజ్యసభ ఎంపీ ఎంపీ సానా సతీష్‌బాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్టులోని వివిధ గ్యాప్‌లను పరిశీలించారు. ఏలేశ్వరం- అప్పనపాలెం మధ్య ఏలేరు ప్రధాన కాలువపై కుంగిన వంతెనను పరిశీలించారు. కాజ్‌వే నిర్మాణం చేపట్టే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ స్థానికులకు హామీ ఇచ్చారు. ఏలేరు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబు, తోట నవీన్, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్థిరంగా వరద ఉధృతి

పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) ఏలేరు వరద ఉధృతి స్థిరంగా కొనసాగుతోంది. రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను తగ్గించినప్పటికీ కాకినాడ జిల్లా పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో నీటి ఉధృతి మాత్రం తగ్గలేదు. ఏలేరు రిజర్వాయర్‌కు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి ఇన్‌ఫ్లోస్ గణనీయంగా పెరిగాయి. ఇన్‌ఫ్లోస్ మరింత పెరిగితే నీటి విడుదలను పెంచే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.


గొల్లప్రోలు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు

ఇంటి నుంచి బయలుదేరి.. గోదావరిలో శవంగా తేలి..

మృతదేహంపై కత్తి గాయాలు

తన భర్త మృతికి ఐదుగురు కారణమని భార్య ఆరోపణ


అమలాపురం పోలీసుస్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న మృతుడి భార్య దేవి


ఫైల్‌ఫొటో


శ్రీనివాస్ మృతదేహం

అమలాపురం టౌన్/పి.గన్నవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి రాజమహేంద్రవరం బయలు దేరిన ఓ వ్యక్తి కొన్నిరోజుల తర్వాత గోదావరిలో శవంగా తేలాడు. అయితే తన భర్త ఆచూకీ తెలపాలంటూ భార్య, బంధువర్గీయులతో కలిసి బుధవారం అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. భర్త అదృశ్యం వెనుక ఐదుగురు వ్యక్తులు ఉన్నారని మీడియాకు చెప్పింది. ఈ సంఘటన జరిగిన గంటల వ్యవధిలోనే భర్త మృతదేహం లభ్యమైంది. ఇందుకు సంబంధించి అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు, పి.గన్నవరం ఎస్ఐ శివకృష్ణ తెలిపిన సమాచారం ఇలా ఉంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మం డ లం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) ఈనెల 25న ఇంటి నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం వెళ్తున్నట్టు భార్య కంచిపల్లి దేవి తెలిపాడు. భర్త తిరిగి రాకపోవడంతో అన్నిచోట్లా గాలించి చివరకు ఈనెల 27న అమలాపురం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంటి నుంచి సుజుకీ మోటారుసైకిల్‌పై బయలుదేరిన శ్రీనివాస్ భార్యతో సాయంత్రం వరకు 3సందర్భాల్లో ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్చాఫ్‌లోకి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో గోదావరిలో బుధవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆ సమాచారాన్ని ఎస్ఐ శివకృష్ణ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి చేతులపై ఎరుపురంగు తాడుతో పాటు కుడిచేతిపైన రుషి, దేవి, వినీత్ అని ఆంగ్ల అక్షరాలతో టాటూలు ఉన్నాయి. హీరో చిరంజీవితో పాటు ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ టాటూ కూడా మరో చేతిపై ఉంది. దాంతో సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు మృతుడి సోదరుడు అంజితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇది శ్రీనివాస్ మృతదేహమే అని అంజి నిర్ధారించాడు. దాంతో ఈ కేసును అమలాపురం పోలీసుస్టేషన్‌కు బదలాయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. డీకంపోజ్ అయిన మృతదేహంపై పలుచోట్ల కత్తితో పొడిచిన గాయాలు ఉన్నట్టు గుర్తించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అందజేశారు. తన భర్త మృతికి అమలాపురానికి చెందిన ప్రముఖ వ్యాపారి గంగుమళ్ల కాసుబాబు, శంకర్, భాస్కర్ల ప్రసాద్, సలాది అప్పన్న, రావులపాలెనికి చెందిన అనిల్ కారణమని మృతుడి భార్య దేవి ఆరోపించింది. పోస్టుమార్టం నివేదిక అందిన తరువాత గానీ తాము ఏమీ చెప్పలేమని పట్టణ సీఐ వీరబాబు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కాకినాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని ఆర్థిక ఇబ్బందులు కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా ఇంద్ర పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం...కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన కందుకూరి రాజు అతడి కుమారుడు నరేంద్రస్వరూప్(17) కూలీపనులు చేస్తుంటారు. గత కొంతకాలంగా కుటుంబసభ్యులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దీంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో నరేంద్రస్వరూప్ ఉరి వేసుకుని మృతిచెందాడు. ఈ మేరకు అతడి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఉప్పుటేరు కాలువలో తేలిన బాలుడి మృతదేహం


(ఫైల్ ఫొటో)


చరణ్‌సాయి మృతదేహం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేట పర్రకాలువలో ఈనెల 27న గల్లంతైన పోలవరపు చరణ్‌సాయి రిత్విక్ (11) మృతదేహం బుధవారం స్థానిక హరిత రీసార్టు సమీపంలో ఉప్పుటేరులో తేలిఉండటాన్ని పోలీసులు గుర్తించారు. కాకినాడ మధురానగర్‌కి చెందిన చరణ్‌సాయి రిత్విక్ సోమవారం మేనమావయ్య కొప్పిశెట్టి శ్రీనివాస్‌తో కలసి బైక్‌పై నేమాం వెళ్లేందుకు సూర్యారావుపేట పర్రకాలువ కాజ్‌వేపై వెళ్తూ ఉప్పుటేరులో పడిపోవడంతో గల్లంతైన సంగతి విదితమే. బాలుడి ఆచూకీ కోసం తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో గత 2 రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు చరణ్‌సాయి రిత్విక్ మృతదేహం ఎన్టీఆర్ బీచ్ సమీపంలో ఉన్న హరిత రీసార్టు వెనకాల గల ఉప్పుటేరులో తేలియాడుతూ ఉండడాన్ని గుర్తించారు. పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి, అక్కడ శవ పంచనామా చేసిన అనంతరం బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

రెండు బైకుల ఢీ

ఇద్దరికి గాయాలు

శంఖవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు మలుపులో రెండు బైకులు ఢీ కొన్నాయి. బుధవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన అప్పన రాంబాబు, గరగ పండు ఎదురెదురుగా బైక్‌లపై వస్తూ మలుపులో ఒకరినొకరు ఢీకొన్నారు. ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డుకి ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండచిలువ హల్‌చల్..




వలలో చిక్కుకున్న కొండచిలువ

ఉప్పలగుప్తం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటలో బుధవారం కొండచిలువ హల్‌చల్ చేసింది. వలలో చిక్కుకుని బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికుల కంటపడింది. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు సమాచారాన్ని పోలీసు, అటవీశాఖ సిబ్బందికి తెలియజేశారు. వారు వచ్చేలోగానే స్థానికులు కొండచిలువను హతమార్చారు.

రాత్రి ఇంటిలో నిద్రించి... ఉదయం శవంగా కనిపించి!

తుఫాన్ గాలులకు వ్యక్తి మృతి


మరణించిన ఈతకోట శ్రీరాములు

ఉప్పలగుప్తం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం టి.చల్లపల్లి పంచాయతీ పర్రపేటలో బుధవారం ఉదయం ఈతకోట శ్రీరాములు (73) తన ఇంటి ముందే తోటలో శవమై కన్పించాడు. మంగళవారం రాత్రి శ్రీరాములు తన గదిలో పడుకున్నాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జన నిమిత్తం బయటకు వచ్చి తుఫాను గాలుల బీభత్సానికి మృతిచెందినట్టు కుటుంబసభ్యులు చెప్తున్నారు. అయితే ఈ విషయంపై పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు గ్రామ సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వ్యక్తి మృతి

అంతర్వేది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు. అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న ప్రైవేటు వ్యక్తి యడ్ల సత్యశివశంకర్ (44) విద్యుదాఘాతంతో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. రాజోలు మండలానికి చెందిన శంకర్ గత పది సంవత్సరాలుగా సఖినేటిపల్లిలో ఉంటూ అప్పుడప్పుడు అవసరం మేరకు విద్యుత్ అధికారులకు హెల్పర్‌గా పనులు చేస్తుంటాడు. అలాగే మొంథా తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ పోల్‌పై పనిచేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

కాలువలో యువకుడి మృతదేహం లభ్యం


నాగరాజు (ఫైల్)

అంబాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బహిర్భూమి వెళ్లి ప్రమాదవశాత్తు మురుగుకాలువలో పడి యువకుడు మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి శివారు తురకలదొడ్డికి చెందిన గుబ్బల నాగరాజు(35) ఈ నెల 28న సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లాడు. ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. గ్రామానికి సమీపంలో ఉన్న మురుగు కాలువలో నాగరాజు శవమై కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మీనాగప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగరాజు మృతదేహాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర జలవనరుల శాఖ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ అరిగెల సూరిబాబు, టీడీపీ నాయకులు దాసరి వీర వెంకట సత్యనారాయణ, పళ్ల శ్రీనివాసరావు, యనమదల సాయిబాబు తదితరులున్నారు.

అనపర్తిలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫ్రిజ్ సిలెండర్

అనపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శివారు కొత్తూరు జగనన్న కాలనీలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. కాలనీలో నివసిస్తున్న కుక్కల దుర్గాభవాని తన ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటుంది. బుధవారం సాయంత్రం ఆమె ఇంటి నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు తలుపులు పగులగొట్టి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంతలోనే ఒక్కసారిగా ఫ్రిజ్ సిలండర్ పేలడంతో ఆ ప్రాంతమంతా భయందోళనలకు గురయ్యారు. స్థానికులు తలుపులు పగులగొట్టి మంటలను అదుపు చేశారు. అనపర్తి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని నష్టం అం చనా వేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ. 50 వేల వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేస్తున్నామని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.




ప్రమాదం జరిగిన ఇంటి నుంచి వస్తున్న పొగలు, పేలిన ఫ్రిజ్ లోపల సిలెండర్

రైతు బజారుకు సెలవు రద్దు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ప్రజలు కూరగాయలకు ఇబ్బందిపడకుండా రైతుబజార్ల వారంతాపు సెలవు రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ నేపథ్యంలో గాంధీనగర్ రైతుబజారు గురువారం తెరిచే ఉంటుందని ఎస్టేట్ ఆఫీసరు శివ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



గొల్లప్రోలు మండలం దుర్గాడలో నేలవాలిన అరటి చెట్లను పరిశీలిస్తున్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్



కరప మండలం అరట్లకట్టలో రైతులతో మాట్లాడుతున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



కొత్తపల్లి మండలం మాయాపట్నంలో మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

తుఫాన్ వీడి... నష్టాన్ని మిగిల్చి..

నీట మునిగిన, నేలవాలిన పంటలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు

రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా

కరప, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జడ్.బావారం, పెనుగుదురు తదితర గ్రామాల్లో ముంపనకు గురైన పంట పొలాలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. పలువురు రైతులు సాగులో తామెదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మండలవ్యాప్తంగా 1,133 హెక్టార్లలో పంట నేలవాలి నీట మునిగిందని వ్యవసాయ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలను పూర్తి పారదర్శకంగా నమోదు చేసి నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే వారిని ఆదేశించారు. నష్టపోయిన ప్రతి రైతుకు అండగా నిలబడతామని, ఎవరూ ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. డ్రైన్లు, పంట కాలువల్లో నీటికి అడ్డంకిగా వున్న తూటు, గుర్రపుడెక్కలను తక్షణం తొలగించి ముంపు సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పర్యటనలో వ్యవసాయ శాఖ ఏడీ కె.బాబూరావు, ఏవో ఇమ్మిడిశెట్టి సత్య, కరప ఏఎంసీ ఛైర్మన్ ముద్రగడ రమేష్, జడ్.బావారం సొసైటీ అధ్యక్షుడు గంటా వీరన్న చౌదరి, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి, గోన అంజి, బోనాసుల వుల్లయ్యప్రసాద్ పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు పరిశీలించి బాధిత రైతులకు భరోసా కల్పించారు. మునిగిన, నేల వాలిన, మొలకలొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడారు. మండలంలో 2,800 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారన్నారు. పూర్తి నివేదికలతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. వారి వెంట టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు వున్నారు.

కాజులూరు (కరప) (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం చేదువాడ, తర్లంపూడి, శీల తదితర గ్రామాల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం సుడిగాలి పర్యటన చేసి నీట మునిగిన, నేలవాలిన పంట పొలాలను పరిశీలించారు. పంట దెబ్బతిన్న రైతులను కలిసి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుఫాన్ ప్రభావంతో రామచంద్రపురం నియోజకవర్గ వ్యాప్తంగా 41వేల ఎకరాల్లో పంటలు నేలమట్టమయ్యాయన్నారు. జరిగిన నష్టంపై వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబును కలిసి రైతులను అన్ని విధాల ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, చిక్కాల దొరబాబు, తహసీల్దారు ఠాగూర్, ఏవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. ఈదురుగాలులు, తుఫాన్ కారణంగా గొల్లప్రోలు మండలం దుర్గాడలో దెబ్బతిన్న అరటి, బొప్పాయి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. గాలుల కారణంగా నష్టం అధికంగా ఉందని చెప్పారు. పంటలకు జరిగిన నష్టాన్ని తక్షణం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం బృందాలు ఏర్పాటు చేయాలని సూచిం చారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంట చేతికందే సమయంలో తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయామని, పెట్టుబడులు సైతం కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పర్యటనలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ఏడీలు పి.స్వాతి, రాజశేఖర్, తహసీల్దారు రామకుమార్, ఎంపీడీవో సెలట్ రాజు, వ్యవసాయాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెదపూడి (కరప) (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జరిగిన పంటనష్టాన్ని అధికారులు పారదర్శకంగా లెక్కించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో పంట నష్టంపై సమీక్షించారు. పెదపూడి మండలంలో వరి పంటకు 80-90 శాతం మేర నష్టం వాటిల్లిందని, మినుము పంటను పూర్తిగా కోల్పోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు యంత్రాంగం పనిచేయాలని సూచించారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవర, పవర, వీకే రాయపురం, ఉండూరు, కాపవరం, రావువారిచంద్రంపాలెం, పి.వేమవరం గ్రామాలతో పాటు సామర్లకోట పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో బుధవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. నేలవాలిన వరి పంటలను పరిశీలించి వ్యవసాయాధికారులు చెప్తున్న మెళకువలను పాటించాలని సూచించారు. మునిరెడ్డి శ్రీరాములు, చీకట్ల వెంకటేష్, తోట నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. తుఫాన్ కారణంగా కురిసిన అధిక వర్షాలు, వీచిన ఈదురుగాలులకు సామర్లకోట మండలం, పట్టణంలో 6,204 ఎకరాల్లో వరి పంటకు ప్రాథమికంగా నష్టం వాటిల్లిందని సామర్లకోట మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. పలువురు వీఏఏలు పంట నష్టం అంచనాలు రూపొందించే పనుల్లో నిమగ్నమయ్యారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ 47, 48 డివిజన్ల పరిధిలోని బొగ్గవరపు సత్రం, మున్సిపల్ స్కూలు పునరావాస కేంద్రాల్లో ఉన్న సుమారు 200 మంది బాధితులకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు దుప్పట్లు, రొట్టెలు, చిన్నారులకు పాలు పంపిణీ చేశారు. టీడీపీ యువ నాయకుడు గుత్తుల జయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, గౌడ కార్పొరేషన్ల డైరెక్టర్లు కొల్లాబత్తుల అప్పారావు, మట్టా ప్రకాష్ గౌడ్, కూటమి నాయకులు కోనాల కృష్ణ, బుజ్జి, ఆర్.మహేష్, వాసంశెట్టి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లోని ఏలేరు కాలువలను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ బుధవారం పరిశీలించారు. కాలువ గట్లు కోతకు గురికాకుండా వేసిన ఇసుక బస్తాలను చూసి పరిస్థితిపై అధికారులను ఆరా తీశారు. ఏలేరు ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. నీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఏలేరుకు ఎక్కడా గండిపడకుండా, గట్లు దెబ్బతినకుండా చూశారని తెలిపారు. నీటి విడుదలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంతో సమస్య ఎదురు కాలేదని చెప్పారు. తుఫాన్ పెనుముప్పు తగ్గడంతో రైతులు స్వల్ప నష్టాలతో బయటపడగలిగారన్నారు. ఆయన వెంట పిఠాపురం తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ ఉన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాడ, అమీనబాద్, మాయాపట్నం, జగ్గరాజుపేటల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పర్యటించారు. పాడైన రోడ్లు, పడిపోయిన కరెంటు స్తంభాలు, ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ముప్పుతో మూడు రోజులుగా పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇంటి బాట పట్టారు. కాకినాడ రూరల్ పరిధిలోని సూర్యారావుపేట, వాకలపూడి హార్బరుపేట, నేమాం, పోలవరం, తూరంగి తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న సుమారు 3వేల మందిని అధికారులు ఈ నెల 27న బస్సుల్లో తరలించారు. తుఫాన్ ముప్పు తప్పడంతో బుధవారం మధ్యాహ్నం భోజనాలు పెట్టిన అనంతరం డీపీవో రవికుమార్, తహసీల్దారు వీఎల్ఎన్ కుమారి, ఎంపీడీవో పసుపులేటి సతీష్, డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఆర్ ఆంజనేయులు, కార్యదర్శి పిడుగు పాండురంగారావు, ఎంఈవో తుమ్మల సత్య రంగారావు దగ్గరుండి వారిని ఆయా గ్రామాలకు బస్సుల్లో ఉండి పంపించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న సుమారు రెండు వేల మందికి ఉదయం టిఫిన్, పాలు, మధ్యాహ్నం, రాత్రి 9,800 మందికి భోజనాలు పెట్టినట్టు తహసీల్దారు కుమారి, ఎంపీడీవో సతీష్ చెప్పారు.



కాకినాడ రూరల్ వాకలపూడి పునరావాస కేంద్రంలో ఆహారం తీసుకుంటున్న మత్స్యకార మహిళలు



కాకినాడలో పునరావాస కేంద్రంలో వున్న బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ యువ నేత జయేంద్రబాబు



పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో పంట నష్టంపై అధికారులతో సమీక్షిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పారిశుధ్య నిర్వహణ అధ్వానం

పిఠాపురం మురికికూపంగా మారింది... కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, వీధులు దుర్గంధపూరితంగా మారాయని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. పట్టణం మురికికూపంగా మారిందని, పారిశుధ్య నిర్వహణపై అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్ సోమరౌతు లలితాదేవి మండిపడ్డారు. పుష్‌కార్టులు, ట్రాక్టర్లు సరిగా పనిచేయట్లేదని, ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోతోందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ తెలిపారు. గతంలో చేసిన పనులకు ఇంత వరకు బిల్లులు చెల్లించకపోవడంపై కో-ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, కౌన్సిలర్లు బోను దేవ, తలిశెట్టి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ నిధులు పుష్కలంగా ఉండగా చెల్లింపులు ఎందుకు జరగట్లేదని నిలదీశారు. ప్రభుత్వం ఈ నిధులను లాక్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపల్ మేనేజరు హరిమోహన్ పనితీరు, వ్యవహారశైలిపై కౌన్సిలర్లు బొజ్జా జగదీశ్వరి, అల్లవరపు నగేష్, గండేపల్లి బాబీ తదితరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తు పేరుతో కార్యాలయం తలుపులు వేసేయడం, కౌన్సిల్ సభ్యులపై నిఘా ఉంచడం, సచివాలయ మహిళా ఉద్యోగులను వేధించడం తదితర అంశాలపై ప్రశ్నించారు. పనిచేయడం ఇష్టం లేకుంటే వెళ్లిపోవాలని సూచించారు. మేనేజరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నమాంబ పార్కు చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయాయని, ఇక్కడ కొందరు దందా నిర్వహిస్తూ దుకాణదారుల వద్ద సొమ్ములు వసూలు చేస్తున్నారని అల్లవరపు నగేష్ ఆరోపించారు. ఆక్రమణలను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారుని కోసం గాలింపు

కాకినాడ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద సముద్రంలో గల్లంతైన దుమ్ములపేటకు చెందిన మత్స్య కారుడు గద్దేపల్లి సాయిరాం కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బుధవారం చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొన్నారు. దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయిరాం కుంభాభిషేకం రేవు వద్ద బోట్లను తాళ్లతో కడుతూ అలల తాకిడికి సముద్రంలో పడిపోయి గల్లంతయ్యాడు. అతడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. గాలింపులో ఆర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర, పోర్టు సీఐ సునీల్, టీడీపీ తుమ్మల రమేష్, మోసా పేతూరు, చోడిపల్లి సతీష్, ఎరుపల్లి రాము, మూగు రాజు, సీరం చిన్న, అబ్బాయి పాల్గొన్నారు.



రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

పెరుగుతున్న సుద్దగడ్డ వరద

కాలనీలకు పొంచి ఉన్న ముంపు

గొల్లప్రోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సుద్దగడ్డ వరద ఉధృతి బుధవారం సాయంత్రానికి భారీగా పెరిగింది. గొల్లప్రోలు-తాటిపర్తి రోడ్డుపై ఐదున్నర అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ రహదారిపై రాకపోకలను పూర్తిస్థాయిలో నిలిపివేశారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో గొల్లప్రోలులోని కాలనీలకు ముంపు పొంచి వుంది. ఏ క్షణమైనా వరద నీరు చేరవచ్చని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గొల్లప్రోలు శివారు కొత్త కాలనీ వద్ద సుద్దగడ్డ వరద పరిస్థితిని ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పరిశీలించారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



గొల్లప్రోలు ఆర్అండ్‌బీ రహదారిలో లారీపై కూలిన వృక్షం



పెద్దాపురం మండలం కట్టమూరులో కూలిన కేశవ, పట్టాభిరామస్వామి దేవస్థానం గోడ

గొల్లప్రోలు/పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీరం దాటే సమయంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలు, మండలాల పరిధిలోని గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కరెంటు తీగలు తెగిపోయాయి. గొల్లప్రోలు శివారు పెట్రోలు బంకు సమీపంలో ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న వృక్షం లారీపై కూలింది. ఆ సమయంలో లారీలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కూలిపోవడంతో గొల్లప్రోలు మీదుగా లారీలు, బస్సుల రాకపోకలకు ఐదు గంటలు అంతరాయం కలిగింది. అగ్నిమాపక, విపత్తుల శాఖ సిబ్బంది రంగంలోకి దిగి చెట్లను తొలగించారు. గాలుల కారణంగా మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి బుధవారం సాయంత్రం వరకు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పిఠాపురంలోని పలు ప్రాంతాల్లో రాత్రి వరకు సరఫరాను పునరుద్ధరించలేకపోయారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీరం దాటే సమయంలో వీచిన బలమైన ఈదురుగాలులకు ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రంలో కెరటాలు ఎగసిపడ్డాయి. దీంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా తెల్లవార్లు జాగారం చేశారు. కెరటాల ధాటికి మాయాపట్నం, సూరాడపేట, కోనపాపపేటల్లో మత్స్యకారుల ఇళ్లు కోతకు గురయ్యాయి. ఉప్పాడ-మూలపేట బీచ్ రోడ్డులో అమీనబాద్ పెట్రోలు బంకు సమీపంలో రోడ్డుపక్కనున్న చెట్టు ఈదురుగాలులకు విరిగిపడడంతో వాహనాల రాకపోకలకు తెల్లవార్లు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న కొత్తపల్లి తహసీల్దారు చిన్నారావు తక్షణం స్పందించి చెట్టు తొలగింపునకు చర్యలు చేపట్టారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు పెద్దాపురం-కట్టమూరు ప్రధాన రహదారిలో నేలకూలిన చెట్లను ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి కట్టమూరు, కాండ్రకోట గ్రామాల్లో పర్యటించి ఏలేరు వరద ఉధృతిని పరిశీలించారు. కట్టమూరులో కేశవపట్టాభిరామస్వామి దేవస్థానం గోడ పాక్షికంగా కూలింది. పట్టణ పరిధిలోని గౌరీకోనేరులో కూలిన భారీ వృక్షాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారు. నేలకూలిన విద్యుత్ స్తంభాలను ఆ శాఖ అధికారులు పునరుద్ధరించారు. గౌరీకోనేరు కాలనీవాసులకు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ

కాకినాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా రోజువారీ పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్దే ఉన్న పేదలకు లయన్స్ క్లబ్ విజన్, సఖి, మైత్రి, స్టార్స్, ఫ్రెండ్స్, మనం, గోల్డెన్ జూబ్లీ, స్పందన, కాకినాడ, పిఠాపురం శాఖలు బిస్కెట్ ప్యాకెట్లు, బన్, జామ్, వాటర్ బాటిల్‌తో కూడిన 3వేల కిట్లను తయారు చేశారు. కాకినాడ ఏటిమొగ, పర్లోవపేట, దుమ్ములపేట ప్రాంతాల్లో వీటిని డాక్టర్ బాదం బాలకృష్ణ, మంజులూరి విశ్వేశ్వరరావు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్‌ల ప్రాంతీయ ఛైర్మన్ డి.పుత్రరావు, అధ్యక్షులు పాపారావు, శ్రీదేవి, సునీత, వీణ, జ్యోతి, సతీష్, వీరభద్రరావు, సత్యనారాయణ, జగన్నాథరావు పాల్గొన్నారు.

కండి కాలువకు ఇసుక బస్తాలతో రక్షణ

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పీబీసీ ఆయకట్టు పరిధిలో గండ్లు ఏర్పడే కాలువలకు ఇసుక బస్తాలతో రక్షణ చేపట్టామని గోదావరి డెల్టా ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ చెప్పారు. యండపల్లిలో కండి కాలువకు గండిపడే ప్రమాదం ఉందని గుర్తించి 400 ఇసుక బస్తాలతో రక్షణ కల్పించినట్టు ఆయన చెప్పారు.





ఎన్ఎంఎంఎస్ రీజనింగ్ పుస్తకావిష్కరణ

కాకినాడ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ సంయుక్తంగా రూపొందించిన ఎన్ఎంఎంఎస్ రీజనింగ్ పుస్తకాన్ని డీఈవో పి.రమేష్ బుధవారం ఆవిష్కరించారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు ఎన్ఎంఎంఎస్ మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (రీజనింగ్) స్టడీ మెటీరియల్‌ను తయారు చేశారని జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ వర్మ తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కేఎంఎం ప్రసాద్, వర్మ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు సీహెచ్ సూరిబాబు, కె.నగేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్వీ పద్మావతి, ఆడిట్ కమిటీ కన్వీనర్ రాజబాబు, సీనియర్ నాయకుడు జి.ప్రభాకరవర్మ తదితరులు పాల్గొన్నారు.



రోగుల సహాయకులకు భోజనం

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, టీడీపీ నాయకుడు అమన్ జైన్ బుధవారం భోజనం సదుపాయం కల్పించారు. సెక్యూరిటీ మేనేజరు ఎస్.శ్రీనివాస్ సహకారంతో సుమారు 300 మందికి భోజన ఏర్పాట్లు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కాకినాడ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుమ్ములపేటకు చెందిన మోసా దేవరాజుకు కాలేయం సంబంధిత వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10లక్షలు మంజూరైంది. బుధవారం అతడికి చెక్కును కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల రమేష్, చోడిపిల్లి సతీష్, ఎరిపిల్లి రాము, మోసా పేతూరు మూగ రాజు, తిరిది ఎల్లయమ్మ తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామికి వెంకన్న నామాలతో అలంకారం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాయతన సమేత ఉమారాలింగేశ్వరస్వామికి అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు వెంకటేశ్వరస్వామి నామాలతో అలంకారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

'బాధితులను ఆదుకోవాలి'

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గాడలో దెబ్బతిన్న అరటి, బొప్పాయి, పూల తోటలు, కాయగూర పంటలను మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ బుధవారం పరిశీలించారు. రైతులకు పంట నష్టపరిహారంతో పాటు ఇన్సూరెన్స్ ద్వారా పరిహారం ఇవ్వాలన్నారు. ఆమె వెంట గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, నాయకులు గొల్లపల్లి నానాజీ, ఆకుల శ్రీను, లోకారెడ్డి అప్పన్నదొర, వెలుగుల సత్యనారాయణ, ఓరుగంటి రవి, ప్రసాద్, నూజివీడు సూర్య ఉన్నారు.

పిఠాపురానికి మూడు అంబులెన్సులు మంజూరు

గొల్లప్రోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గానికి నూతనంగా మూడు 108 అంబులెన్సులు కేటాయించారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు ఇవి వచ్చాయి. ఇప్పటివరకు ఉన్న పాత అంబులెన్సుల స్థానంలో ఇవి సేవలు అందించనున్నాయి. గొల్లప్రోలుకు బుధవారం వచ్చిన అంబులెన్సును వినియోగంలోకి తీసుకువచ్చారు. బేసిక్ లైఫ్ సపోర్టు పరికరాలతో వున్న అంబులెన్సు అత్యవసర సేవలకు ఉపయోగపడుతుందని సిబ్బంది తెలిపారు.

కొత్తపట్నం వద్ద గండి

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ తీరంలో కొత్తపట్నం వద్ద బీచ్ రోడ్డుపై గండి పడింది. విషయం తెలుసుకున్న తహసీల్దారు చిన్నారావు సంబంధిత అధికారులతో చర్చించి బండ రాళ్లను డంప్ చేసే చర్యలు చేపట్టారు. ఆయనకు స్థానిక మత్స్యకారులు కృతజ్ఞతలు తెలిపారు.

జ్యోతుల నవీన్ పరామర్శ

జగ్గంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం సీతానగరానికి చెందిన టీడీపీ నాయకులు జగ్గంపేట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కోడూరి సత్యనారాయణ, శివరామకృష్ణల తండ్రి వెంకట్రావు ఇటీవలే మరణించడంతో బుధవారం జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ వెంకట్రావు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

● స్తంభించిన జనజీవనం


ఇందుకూరుపేటలో నేలకొరిగిన వరి

దేవీపట్నం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ ధాటికి మంగళవారం రాత్రి నుంచి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో చొప్పకొండ గంగవరంలో విద్యుత్ స్తంభం నేలకూలింది. ఇందుకూరుపేట, ఇందుకూరు, వి.రామన్నపాలెం, తదితర గ్రామాల్లో సుమారు 55 ఎకరాల వరి పంట, 60 ఎకరాల అపరాలు నేలకొరిగాయి. పరగసానిపాడు ఆర్అండ్ఆర్ కాలనీ, ఇందుకూరు గ్రామ సమీపంలో చెట్లు నేలకూలాయి. దీంతో ఎస్ఐ షరీఫ్, తన సిబ్బందితో అక్కడికి చేరుకుని తొలగించి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

రాజవొమ్మంగి: మండలంలో తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు, చెట్లు రోడ్డుపై పడ్డాయి. అధికారులు లబ్బర్తి-అనంతగిరి, దూసరిపాము-నెల్లిమెట్ల , వట్టిగెడ్డ-ఎర్రంపాడు,వాతంగిలో పాల కాలువ ఉధృతంగా ప్రవహించడంతో లోతట్టు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. స్పెషల్ డిప్యూటి కలెక్టర్ అంబేడ్కర్, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపిడిఓ యాదగిరేశ్వరావు, సీఐ గౌరీశంకర్ , ఎస్ఐ శివ కుమార్ పరిస్థితులను సమీక్షించారు. రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ వట్టిగెడ్డ-ఎర్రంపాడు గ్రామాల మధ్య వాగును ఆకస్మికంగా పరిశీలించారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఫోర్ బై టర్నింగ్‌లో తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల చెట్లు నేలకూలడంతో రాకపోకలు స్తంభించాయి. ఫోర్ బై టర్నింగ్ వద్ద రోజ్ వుడ్ చెట్టు పడింది.

అడ్డతీగల: మండలంలో తుఫాన్ బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా లేక 99 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈదురుగాలులతో ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకూలడంతో మైదాన ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలిగాయి.

వై.రామవరం: మండలంలో తుఫాన్ పరిస్థితులను బుధవారం మండల ప్రత్యేకాధికారి, రంపచోడవరం పీహెచ్‌వో దయానంద పర్యవేక్షించారు. బండిగడ్డ, చామగడ్డ, పనసలపాలెం, పి.ఎర్రగొండ, తదితర గ్రామాలు సందర్శించి అప్రమత్తత చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అలాగే బండిగడ్డ, సింగవరం గ్రామాల మధ్య ఉన్న కాకులమామిడి వాగు ఉధృతిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో బాపన్నదొర, ఎంపీపీ ఆనందరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, హెల్త్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

మోతుగూడెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): లోయర్ సీలేరు జల విద్యుత్ కేంద్రం పరిధిలోని విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు పొల్లూరు విద్యుత్ కేంద్రం ఆవరణలో నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ జెన్కో యాజమాన్యం సహకారంతో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలలో అవినీతి నిర్మూలించడానికి నిజాయితీగా, నిబద్ధతలు ఉంటాయని, మా విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఏడీఈ శంకరరావు, ఏఈలు రాజేష్, అరుణ, లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో ఇన్‌చార్జి అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ టిప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ సయ్యద్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలియపర్చకుండా కమిటీలు వేయడం బాధాకరం

దేవీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల ఎస్టీ కమిటీల ఏర్పాటులో స్వచ్ఛత లేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, నీటి సంఘాల అధ్యక్షుడు చవలం రామకృష్ణదొర ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ మండలాధ్యక్షుడు గోళ్ల చంటిబాబు సీనియర్ నాయకులకు తెలియపర్చకుండా కమిటీలు వేయడం బాధాకరమన్నారు. వైసీపీ నుంచి వచ్చిన వారికి ఎస్టీ కమిటీ అధ్యక్షుడిగా నియమించడం సరైంది కాదన్నారు.

అప్రమత్తంగా ఉండడం వల్లే నష్టం లేదు : ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వం అప్రమత్తంగా ఉండడం, అధికారులు ఎక్కడికక్కడ చర్యలు చేపట్టడం వల్లే తుఫాన్ ప్రభావం ఉన్న నష్టం లేదని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మండలంలోని ఎర్రంపాడు వాగును, వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఏకలవ్య పాఠశాలను, గురుకుల కళాశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేసారు. విద్యార్థులకు ఏమైన ఇబ్బందులు ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు.

అడ్డతీగలలో ఉచిత వైద్యశిబిరం

అడ్డతీగల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ దేవి ప్రియాంక ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పిల్లలకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, జ్వరం, రక్తహీనతతో ఉన్న విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి వైద్యం అందించారు. మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పిల్లలకు సూచించారు. అలాగే జిల్లా పరిషత్ స్కూల్ పునరావాస కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవో భాస్కరరావు, హెచ్‌వి చిన్నాయమ్మ, సీహెచ్‌ఓలు వెంకట్, విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే


కన్నేరు వాగును పరిశీలిస్తున్న దృశ్యం

రంపచోడవరం, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం గంగవరం మండలంలోని కురుమగొంది కన్నేరువాగును పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు చెప్పే జాగ్రత్తలు పాటించాలన్నారు. వాగులు దాటకుండా ఆయా ప్రదేశాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అనంతరం పలు గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం నాయకుడు కనిగిరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి విలీన మండలాల సమస్యలు


మంత్రికి సమస్యలు వివరిస్తున్న రంజిత్ కుమార్

కూనవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లినట్టు అరకు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్ తెలిపారు. పోచవరం, కాచవరం పంచాయతీ గ్రామాలను 41.15 కాంటూర్‌లో కలపాలని గతంలోనే మంత్రిని కలవడం జరిగిందన్నారు. ఈగ్రామాలతో పాటు వెంకటాయపాలెం, దూగుట్ట, కరకగూడెం, చూచిరేవులను ముంపు జాబితాలో చేర్చాలని మంత్రి కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా ఉన్నట్టు రంజిత్‌కుమార్ తెలిపారు.

రంపచోడవరాన్ని జిల్లా చేయాలి

కూనవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను కలిపి రంపచోడవరాన్ని జిల్లా చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజ అనిల్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్‌ను నాన్ ఏజెన్సీలో కలపడాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ రెండు నియోజకవర్గాలను కలిపి ఒకే నియోజకవర్గంగా చేస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

వరి, పత్తి, కూరగాయల పంటలకు అపార నష్టం

● దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, కూలిన స్తంభాలు
● కూలిన ఇళ్లు, పూరిగుడిసెలు



తొండంగి: నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివ్య, తుని రేఖవానిపాలెం వద్ద నేలవారిన అరటిపంటను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ మెట్ట రైతును నిలువునా ముంచింది. విరుచుకుపడ్డ తుఫాన్ కారణంగా మూడు రోజులు పాటు మెట్ట ప్రాంతంలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వల్ల పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ప్రత్తిపాడు, ఏలూరు, టి.రాయవరం, ఉత్తరకంచి, లంపకలోవ, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. అలాగే ఈదురుగాలులకు ఈనిక దశలో ఉన్న వరిచేలు నేలవారాయి.దీంతో నష్టాలు ఎదురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం, ఒమ్మంగి, పోతులూరు, వాకపల్లి, బవురువాక తదితర గ్రామాల్లో పత్తి,కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. దిగుబడి చేతికి అందే సమయంలో వర్షాలకు పత్తి చేలకు తీరని నష్టం వాటిల్లింది. పత్తి కాయల్లోని పత్తి కుళ్లిపోయింది. అలాగే కూరగాయలు చిక్కుడు, ఆకాకరతో పాటు మినుము, పెసర వర్షాలకు దెబ్బతిన్నాయి. ఒమ్మంగి, శరభవరం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరిశీలించారు. అలాగే దెబ్బతిన్న వరి, పత్తి, కూరగాయల పంటలను తహసీల్దార్ సూర్యప్రభ, మండల వ్యవసాయాధికారి జోకా అమృత, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ

తొండంగి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):మత్స్యకారుల సంక్షేమం, భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. బుధవారం ఆమె దానవాయిపేట, ఎల్లయ్యపేట, యర్రయ్యపేట, వేమవరం, పంపాదిపేట, అద్దరిపేట తదితర గ్రామాల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడి సౌకర్యాలపై ఆరాతీశారు. దానవాయిపేట, అద్దరిపేట గ్రామాల్లో బాధితులకు స్వయంగా వడ్డించి ఆహార పదార్థాల రుచి, శుభ్రత, ప్రభుత్వం కల్పించినసౌకర్యాలపై ప్రశ్నించారు. అనంతరం మాట్లాడుతూ తుఫాన్ సందర్భంగా వేట కోల్పోయిన మత్స్యకార కుటుంబాలు 50కిలోల బియ్యం, పప్పు, ఆలుగడ్డలు, నూనె, చింతపండు, ఉల్లిపాయలు, నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను అందిస్తామన్నారు. వేమవరం వద్ద ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, అరిగెల నర్సింహమూర్తి, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, కాశీ, కొయ్యా కేశవ, సూరిబాబు, తహశీల్దార్ కాంతారావు, ఎంపీడీవో సాయి నవీన్ పాల్గొన్నారు.

నేలకొరిగిన చెట్లు

తుని రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో మెట్టలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. తుని నియోజకవర్గం వ్యాప్తంగా వాగు లు, వంకలు ప్రవహిస్తున్నారు. ఈదురుగాలులతో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్థంభాలతో పాటు పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తుని మండలం చేపూరులో 4 ఇళ్లు, తాళ్లూరులో 3 ఇళ్లు, హంసవరంలో 3 ఇళ్లు దెబ్బతిన్నట్లు తహశీల్దార్ ప్రసాద్‌తెలిపారు. వారికి ప్రభుత్వ తక్షణ సహాయం అందజేశామన్నారు. మండలవ్యాప్తంగా 116ఎకరాల్లో వరి, 222ఎకరాల పత్తి దెబ్బతినగా అరటి 12.50 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక నిర్ధారణ చేశారు. తాండవ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తుని పట్టణ పరివాహక ప్రాంతాలైన ఒకటో వార్డుతో పాటు ఇసుకలపేటలో నివాసం ఉన్న కుటుంబాలు బిక్కుబిక్కుమంటున్నారు. ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాలతో ఆప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లేడుపాడు గ్రామస్తులను ముంపు నుంచి కాపాడేందుకు పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ అందుతున్న సేవలను టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, సీనియర్ నాయకుడు యనమల రాజేష్ పరిశీలించారు.

తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులు

జగ్గంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో గుర్రంపాలెంలో కోత దశలోని వరి చేను, మొక్కజొన్న, మునగ పంటలకు నష్టం వాటిల్లింది. కూర అరటి, మినప పంటలకు చేతికి వచ్చిన పంటలు నేల పాలయ్యాయి. పది రోజుల్లో మినప పంట చేతికి అందే సమయంలో వర్షాలు, గాలులకు తీవ్రంగా నష్టపోయినట్టు మండల రైతులు వాపోతున్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

భారీ వర్షాలకు, ఈదురుగాలులకు జగంపేట మండలంలో 5 గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయాధికారులు అంచనావేశారు. మండల వ్యవసాయాఅధికారి ఎస్.నరసింహ బుధవారం గ్రామాల్లో పర్యటించి ప్రాథమిక అంచనాలను తయారు చేసి ప్రభుత్వాన్ని నివేదించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

జగ్గంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల కాట్రావలపల్లి నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో 10విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఎలక్ట్రికల్ ఏఈ, డీఈలతో కలిసి పునరుద్ధరించే పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కాట్రావులపల్లి అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, అడబాల వీరబాబు, నార్ల దినేష్, గొంప సురేష్, దాడి మణికంఠ, వనుం రాంబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శిథిలమైన గోడ తొలగింపు

కోటనందూరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):తుఫాన్‌తో జగన్నాధపురం సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో అధికారులు తొలగించారు. బొద్దవరం ఇంటి ప్రహరీ గోడ రోడ్డుపై కూలడంతో జేసీబీ సహాయంతో తొలగించారు. కొట్టాం వద్ద కండివాగు ఉధృతికి వరిపంట నీట మునిగింది. అధికారులు ముందస్తు చర్యలతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఎస్ఐ టి.రామకృష్ణ, తహశీల్దార్ పి.సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు.

కుప్పకూలిన రెండు పెంకుటిళ్లు

కిర్లంపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పాలెంగ్రామంలో చిక్కిరెడ్డి సోమరాజు, సమ్మిటి అనంతలక్ష్మిపెంకుటిల్లు కుప్పకూలాయి. ముందుగానే గుర్తించిన అధికారులు ఆయా ఇళ్లల్లోని కుటుంబీలకు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈవిషయాన్ని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పాటంశెట్టి మురళీకృష్ణ, ఆళ్ల రవికిషోర్ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు తెలపడంతో బుధవారం ఆయన బాధితుడు సోమరాజు కుటుంబానికి తాత్కాలికంగా షెడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. అనంతలక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, నగదు, బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, ఏలేరు డీసీ వైస్‌చైర్మన్ నీలం శ్రీను, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, అడబాల కొండబాబు, దాడి సుబ్బారావు, పోతుల సత్యనారాయణ, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో హరికృష్ణ ఉన్నారు.

నేలకొరిగిన చెట్లు తొలగింపు

కిర్లంపూడి,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి గాలులు వీయడంతో చెట్లు నేలకొరిగాయి. దీంతో కిర్లంపూడి ఇన్‌చార్జి ఎస్ఐ రాజా తన సిబ్బందితో నేలకొరిగిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. నేలకొరిగిన వరిచేలను బుధవారం ఏవో సుధామాధురి గెద్దనాపల్లి, ఎస్.తిమ్మాపురం, బూరుగుపూడి, కృష్ణవరం, తామరాడలో పరిశీలించారు.




జగ్గంపేట: గుర్రంపాలెంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట, కిర్లంపూడి: వరి చేలు పరిశీలిస్తున్న ఏవో మాధురి, కోటనందూరు: బొద్దవరంలో కూలిన గోడను తొలగిస్తున్న దృశ్యం

గృహ యజమానులను ఆదుకోవాలి

జగ్గంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఒ.కొత్తూరు గ్రామంలో మొల్లేటి సుబ్బలక్ష్మి నివాస గృహం, పాలెం గ్రామంలో చెక్కిరెడ్డి సోమరాజు నివాస గృహాలు కూలిపోయాయని, ఆ కుటుంబాలను ఆదుకోవాలని పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు.

ముంపు బాధితులకు ఆహారం పంపిణీ

కిర్లంపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో మండలంలో శృంగరాయునిపాలెంలో సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపీటీసీ గరగా గోవిందు, గొడే బాల, మాజీ సర్పంచ్ తిరుమళ్ల సత్యానందం, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులకు పునరావాస కేంద్రంలో 400మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాన్ని జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొజ్జపు నాగేశ్వరరావు, గొడే వాసు, అల్లుమల్ల వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు, కిర్లంపూడి ఆర్ఐ సత్యదేవి, కార్యదర్శి కిడారి జ్యోతి, వీఆర్వో ఇస్మాయిల్ ఉన్నారు.

సుబ్బారెడ్డిసాగర్ ఆయకట్టు రైతులకు అండగా ఉంటా


ప్రాజెక్టును సందర్శించిన ప్రాజెక్టు చైర్మన్ అప్పారావు

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.గోకవరం వద్ద గల మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు అండగా ఉంటామని ఆ ప్రాజెక్టు చైర్మన్ ఇళ్ళ అప్పారావు చెప్పారు.బుధవారం సాయంత్రం ఆయకట్టు రైతులతో కలిసి సాగర్‌ప్రాజెక్టును ఆయ న సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 82.80మీటర్లపైకి చేరుకుందని సంబంధిత ఇరిగేషన్ సిబ్బంది చైర్మన్‌కు తెలిపారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువను చైర్మన్ పరిశీలించి గట్ల పటిష్టతను ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. సాగర్ ప్రాజెక్టు ఆయకట్టుపరిధిలో ఉన్న 10వేల ఎకరాల పంట పొలాలకు సజావుగా నీరు అందేలా చర్యలు తీసుకుని ఆయకట్టు రైతులకు తోడ్పాటునందిస్తామని తెలిపారు.

రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రత్తిపాడు,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు హైస్కూల్ సమీపంలోని పునరావాస కేంద్రంలో బాధితులకు బుధవారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎలిపే రాంజీ ప్రసాద్ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.


సిద్దివారిపాలెంలో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కోటి బిల్వార్చన ప్రారంభం

శంఖవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సిద్దివారిపాలెం అయ్యప్ప క్షేత్రంలో నెలరోజుల పాటు జరిగే కోటి బిల్వార్చన కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివారరావు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పూజలు నిర్వహించారు. గురువారం నుంచి అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు భోజన ఏర్పాటు చేశారు.


అరుణాచల ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అరుణాచలేశ్వర ఆలయంలో విశిష్ట పూజలు



ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర ఆలయంలో కార్తీక శుద్ధ అష్టమిని పురస్కరించుకుని బుధవారం విశిష్ట పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు రామానందస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు సంకటహర గణపతి హోమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామికి పంచామృత అభిషేకంతో పాటు అరుణాచలేశ్వర స్వామి, అమ్మవార్లకు సామూహిక పంచామృత రుద్రాభిషేకాలు, పూర్ణాహుతి, పంచ హారతులు నిర్వహించారు. అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుఫాన్ నష్టాన్ని అంచనా వేసి సాయం అందిస్తాం

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ప్రత్తిపాడులో తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో పంట నష్టాలు, గృహ నష్టాలు అంచనా వేసి తగిన సాయాన్ని అందించి ఆదుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మండలంలో దెబ్బతిన్న పంటలను, నివాస గృహాలను బుధవారం ఆమె పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు ఆర్థికసాయం అందించారు. తహశీల్దార్ సత్యప్రభ, ఎంపీడీవో కుమార్ బాబు, కూటమి నాయకులు సత్యంశెట్టి సీతారాం, ఎస్.సోమరాజు, రామిశెట్టి మున్నిబు, అమరాది వెంకట్రావు, జింకల తాతారావు, పోలినాటి భగవాన్ పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి: తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీను కోరారు. రాయవరం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. పంట నష్టాలను వెంటనే చేపట్టి బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

నష్టపరిహారం ఇవ్వాలి: తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలకు అధికారులు పార్టీలతో సంబంధం లేకుండా తక్షణమే నష్టపరిహారాన్ని నమోదు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

విద్యుత్ అవాంతరాలతో తాగునీటి ఇబ్బంది: తుఫాన్ కారణంగా మండలంలో విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నమై అనేక గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి. గజ్జినపూడి, శరభవరం, చింతలూరు, యజేపురం, వెంకటనగరం, బవురువాక, పొదురుపాక తదితర గ్రామాల్లో 2 రోజులుగా తాగునీరు సరఫరా స్తంభించిపోయి గ్రామస్తులు అవస్థలు పడ్డారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్, తహశీల్దార్ సూర్యప్రభ జనరేటర్లను రప్పించి గ్రామాల్లో మంచినీటి పథకాలు పని చేసేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా అందక గ్రామాలు అంధకారంలో ఉన్నాయి.


రౌతులపూడి మండలం ఏలేరు కాలువలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

రౌతులపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పర్యటించారు. బంగారయ్యపేట, మల్లంపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువను, రౌతులపూడిలో ఏటికాలువ తూర్పుమధుం గట్టునూ, మల్లవరంలో రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును పరిశీలించారు. మూలగపూడిలో వర్షాలకు కూలిపోయిన సి.సత్తిబాబు తాటాకిల్లును పరిశీలించి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆమె వెంట టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు తహశీల్దార్ ఎన్వీ నరేష్, ఎస్ఐ వెంకటేశ్వరరావు ఉన్నారు.


తొండంగిలో దివిస్ ఆధ్వర్యంలో భోజనాల పంపిణీ

నష్టం అంచనా నమోదు ప్రారంభం

తొండంగి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా మండలంలో నష్టపోయిన ఉద్యాన పంటల నమోదు ప్రారంభమయ్యింది. తుని ఉద్యానశాఖాధికారి ఎన్.సుజాత బుధవారం ఏ.కొత్తపల్లిలో పంట నష్టాన్ని పరిశీలించారు. గ్రామంలో ప్రాథమికంగా 18 ఎకరాల్లో అరటి, 20 ఎకరాల్లో దుంప కూరగాయల పంటకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు.

దివీస్ ఆధ్వర్యంలో భోజనాల పంపిణీ: ఒంటిమామిడి దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 26,500 మంది తుఫాను బాధితులకు భోజనాలు పంపిణీ చేసినట్లు దివిస్ ప్రతినిధులు సుధాకర్, వాసుబాబు తెలిపారు. మూడు రోజుల్లో రూ.12 లక్షల విలువైన భోజనాలు అందించామన్నారు. హరేకృష్ణ ఫౌండేషన్, అల్లూరి ఫౌండేషన్ ద్వారా బాధితులకు భోజనాలు సరఫరా చేసినట్లు తెలిపారు. ఉప్పాడ, మూలపేట గ్రామాలకు 50 వేల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు.

కత్తిపూడిలో కూలిన ఇల్లు

శంఖవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను బీభత్సానికి కత్తిపూడికి చెందిన సందయ్య, అప్పారావుల ఇల్లు కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తడిసిపోయి నేలకు ఒరిగినట్టు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధుల పర్యటన

జగ్గంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు స్థానిక రావులమ్మనగర్‌లో రాజ్యసభ ఎంపీ సానా సతీష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ముఖ్య నాయకులతో కలిసి బయలుదేరి వెళ్లారు. రైతులు, ప్రజల వివరాలు తెలుసుకుని ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్వీ ఎస్ అప్పలరాజు, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, తోట గాంధీ, జీనుమణి బాబు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, జాస్తి వసంత్, భూపాలపట్నం ప్రసాద్, తోట గాంధీ, కొండ్రుతూ శ్రీను పాల్గొన్నారు.

గ్రామస్తుల కలవరం

రౌతులపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో రౌతులపూడి మండలం బంగారయ్యపేట వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది. ఏలేరు ఎడమ కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నది. గుట్టకు అడుగు ఎత్తులో నీరు పారడంతో గట్టుపై నుంచి నీరు పారితే గట్టు కృంగి గ్రామం మునిగిపోతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

400 ఎకరాల్లో పంట నష్టం: మండలంలో సుమారు 400 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని మండల వ్యసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, దివ్యశ్రీ తెలిపారు. 300 ఎకరాల్లో పత్తి, వరి 58, అరటి, బొప్పాయిలకు 30 ఎకరాల్లో నష్టం జరిగిందన్నారు.

రోగులకు భోజనాల పంపిణీ

జగ్గంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యుడు కొణిదల నాగబాబు జన్మదిన వేడుకలను నియోజకవర్గంలో నిర్వహించారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు భోజనాల ఏర్పాట్లు, వృద్ధులకు దుప్పట్లు అందించారు. గండేపల్లి మండలంలో రాగంపేటలో జగ్గంపేట హెల్త్ కమ్యూనిటీ, జగ్గంపేట హెల్త్ కమ్యూనిటీ సెంటర్లో, జగ్గంపేటలో ఉన్న జయా నర్సింగ్ హోమ్‌లో రోగులకు భోజనాలు పంపిణీ చేసి దుప్పట్లు, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు


జగ్గంపేటలో రోగులకు భోజనాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న జనసేన ఇన్‌చార్జ్ రమేష్